జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## ఖమ్మం

ఆదివారం | 27 | జులై | 2025 ◆ పేజీలు : 6



## పార్టీతో సంబంధం లేదు.. అర్హులకే సంక్షేమ పథకాలు..

- నిరుపేదలు అభివృద్ధి కోరుకునేదే కాంగ్రెస్ పార్టీ...
- రేషన్ కార్డులు పంపిణీ చేసిన కలెక్టర్ అనుదీప్.

ఎమ్మెల్యే రాగమయి.




6 లో..

### మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం



3 లో...

### నిర్ణీత గడువు నందు ఖమ్మంలోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



4 లో...



# నగర అభివృద్ధికి... ప్రణాళికాబద్ధంగా చర్యలు

- విలీన గ్రామాల మౌళిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత
- మహిళల సమగ్ర అభివృద్ధికి పటిష్ట చర్యలు
- 200 కోట్లతో భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు
- ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులను త్వరలో ప్రారంభిస్తాం
- ఖమ్మం నగరంలో పర్యటించి 3వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకు స్థాపనలు చేసిన మంత్రి తుమ్మల

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి:** ఖమ్మం నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. మంత్రి వర్యులు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి శనివారం ఖమ్మం నగరంలో పర్యటించి 3వ డివిజన్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసారు.ఖమ్మం నగర పాలక సంస్థ 3వ డివిజన్ నందు ఎల్.ఆర్.ఎస్.నిధులు 50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణ పనులకు, 50 లక్షల టి.యూ.ఎఫ్.ఐ.డి.సి. నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, ఈనాడు బైపాస్ రోడ్డు నుంచి బల్లెపల్లి వరకు కోటి 80 లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, బల్లేపల్లి ఎస్సీ కాలనీలో 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ

మిగతా 2 లో...

### అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వీడాలి



5 లో...

### జిల్లాలో రైతులందరికీ యూరియా సరఫరా చేస్తాం



4 లో...



## నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పన

- పారిశుద్ధ్యాన్ని పకడ్బందీగా చేపట్టాలి
- వందశాతం పన్నుల వసూలుకు కార్యాచరణ
- అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

ఖమ్మం నగరపాలక సంస్థ కార్యకలాపాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

2 లో..



## భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

- యూరియా అక్రమ రవాణా జరగకుండా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన బందోబస్తు చేపట్టాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందించాలి
- ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ నిర్వహించిన జూమ్ మీటింగ్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్

2 లో..

## నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పన

**ఖమ్మం ప్రతినిధి, ప్రజాజ్యోతి :** స్థానిక నగర ప్రజలకు మెరుగైన వసతుల కల్పన చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.శనివారం కలెక్టర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య తో కలిసి నగరపాలక సంస్థ వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పన్నులు చెల్లించే ప్రజలకు మెరుగైన వసతుల కల్పన బాధ్యత నగరపాలక సంస్థ పై ఉందన్నారు. రహదారులు, పారిశుద్ధ్యం, వసతుల కల్పన పై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. పారిశుద్ధ్యం విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. రోడ్లు,డివైడర్లు, కూడళ్లు పరిశుభ్రంగా ఉండాలన్నారు. ప్రతిరోజూ పారిశుద్ధ్యం పై దృష్టి పెట్టనున్నట్లు కలెక్టర్ అన్నారు. డివైడర్ల వెంబడి, రోడ్డు కిరువైపుల పిచ్చి మొక్కలు శుభ్రపరచాలన్నారు. మీడియన్స్ లో అతిగా పెరిగిన మొక్కలు కట్ చేయడం జరగాలన్నారు. సైన్ బోర్డ్,సూచికలు ఒరగడం,పడిపోవడం జరిగితే సరిదిద్దాలన్నారు.పబ్లిక్ టాయిలెట్ ల నిర్వహణ పటిష్టంగా చేయాలన్నారు.ఆర్థిక సంవత్సరం చివరి వరకు కాకుండా డిసెంబర్ లోగానే పన్నుల వంద శాతం వసూలుకు కార్యాచరణ చేసి, బిల్ కలెక్టర్ లకు రోజువారీ లక్ష్యం పెట్టి, ఆ దిశగా వసూలుకు చర్యలు చేపట్టాలన్నారు.రోడ్ల విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. నగరంలో 4 మేజర్ రోడ్ల విస్తరణ పనులు పురోగతి లో ఉన్నట్లు, డిమాలిష్ పూర్తయి,డ్రయినేజీ నిర్మాణ పనులు జరుగుతున్నట్లు తెలిపారు.పనుల్లో స్థలాలు కోల్పోతున్న అర్హులైన అందరికి పరిహారం అందజేయాలన్నారు. నిరుపేదలు స్థలాలు కోల్పోతే,డబల్ బెడ్ రూమ్ లు అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.వాణిజ్య సముదాయాల దగ్గర ఫుట్ పాత్ ఉండాలన్నారు. నగరంలో 40265 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చినట్లు, దరఖాస్తు రుసుము చెల్లించిన దరఖాస్తుదారుల క్షేత్ర పరిశీలన పూర్తిచేయాలన్నారు.నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలన్నారు. పబ్లిక్ హెల్త్ విభాగంచే చేపడుతున్న అమృత్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 100 కోట్లతో 68 వివిధ అభివృద్ధి పనులు మంజూరు కాగా, 24 పనులు పూర్తి అయినట్లు, 19 పనులు పురోగతి లో ఉండగా, 24 పనులు ఇంకనూ ప్రారంభం కాలేదన్నారు. ఖిలా రోప్ వే కి భూసేకరణ పూర్తయినట్లు అన్నారు. కబేలా కు రెవెన్యూ శాఖ సహకారంతో స్థల సేకరణ చేయాలన్నారు. నగరంలో 105.65 కోట్లతో 388 సివిల్ పనులు మంజూరు కాగా,190 పనులు పూర్తి అయినట్లు,112 పనులు పురోగతి లో ఉండగా,30 పనులు ఇంకనూ ప్రారంభం కాలేదన్నారు.అగ్రిమెంట్ పూర్తయిన పనులు వెంటనే మొదలెట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఒకే కాంట్రాక్టర్ కొన్ని పనులు చేస్తున్నప్పుడు, అన్ని పనులు సమాంతరంగా జరిగేలా చూడాలన్నారు.పనుల వెనుకబాటు, నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని కలెక్టర్ అన్నారు.నెల రోజుల్లో నగరంలో స్పష్టమైన మార్పు రావాలని, నగరం పరిశుభ్రంగా, పచ్చగా ఆహ్లాదకరమైన వాతావరణం లో ఉండాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం నగరం ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా అధికారులు వ్యక్తిగత శ్రద్ధ తో పనిచేయాలన్నారు.ఈ సమీక్ష లో సహాయ మునిసిపల్ కమీషనర్ అనిల్, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, డిసిపి రాజ్ కుమార్,ఏసిపి వసుంధర, డిఇ లు,ఏఇ లు,సానిటరీ సూపర్వైజర్ సాంబయ్య,జవాన్ లు,అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు



**బోనకల్, జూలై 26, ( ప్రజాజ్యోతి ):** మండల పరిధిలోని ఆళ్లపాడు, చిరునోముల, రావినూతల లక్ష్మీపురం ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులకు శంకుస్థాపన కార్యక్రమాలు పండుగ వాతావరణంలో చేయడం జరిగింది,ఈ కార్యక్రమానికి మధిర నియోజకవర్గం ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు,తెలంగాణ పిసిసి మెంబర్ పైడిపల్లి కిషోర్ కుమార్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాలి దుర్గారావు పాల్గొన్నారు, సందర్భంగా వారు మాట్లాడుతూ పేదోడి సొంతింటి కలను ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందని అన్నారు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని తెలిపారు,రావినూతల సొసైటీ చైర్మన్ నారాయణ,మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మారుపల్లి ప్రేమ్ కుమార్,మధిర మార్కెట్ కమిటీ డైరెక్టర్ వట్టికొండ రామకృష్ణ, చేబ్రోలు మల్లికార్జున రావు,ఆత్మ కమిటీ డైరెక్టర్లు కందుల పాపారావు,జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి బద్దు నాయక్,షేక్ జానీ,బంధం సైదులు,టిడిపి మండల నాయకులు బరకయ్య, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి గంగరాజు,వివిధ గ్రామాల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుంగ రాములు,నరసయ్య శాస్త్రి,తాళ్లూరి రవి,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు





(మొదటి పేజీ తరువాయి...)
తన ఆప్త మిత్రుడు జగన్ లేకుండా డివిజన్ 3 లో సమావేశం ఏర్పాటు చేయడం బాధాకరంగా ఉందని అన్నారు.జగన్ ఆశయాలను తన పదవి కాలంలో తప్పనిసరిగా పూర్తి చేస్తానని, ప్రజల సౌకర్యార్థం జగన్ కు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తానని మంత్రి అన్నారు.డివిజన్ 3 కు సంబంధించి ప్రతి పని చేస్తామని అన్నారు. ఖమ్మం కార్పొరేషన్ లో విలీన గ్రామాల్లో అంతర్గత సిసి రోడ్ల నిర్మాణం,డ్రయిన్ల నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించి ఇప్పటివరకు 200 కోట్లరూపాయల విలువ గల పనులు మంజూరు చేశామని అన్నారు. ముఖ్యమంత్రి వద్ద మరో 150 కోట్లు ఖమ్మం కార్పొరేషన్ కు మంజూరు చేయవలసిందిగా ప్రతిపాదనలు పంపానని, ఆగస్టు 15 నాటికి కనీసం మరో 100 కోట్లు మన నగరానికి ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు.ఖమ్మం నగరంలో 280 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు, 160 కోట్లతో మోడల్ మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, 30 కోట్లతో ఖమ్మం ఖిల్లా రోప్ వే పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.ఖమ్మం నగరంలో భూ గర్భ డ్రైనేజీ కోసం 200 కోట్ల మంజూరు చేశామని, నగరంలో మరో 220 కోట్లు అమృత్ నిధులు తీసుకొని వచ్చి త్రాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కరిస్తామని, విలీన గ్రామంలో మౌళిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు.మనల్ని నమ్ముకున్న ప్రజల కోసం ఆర్థికంగా భారం ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం,రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని,మహిళలు 200 కోట్ల ప్రయాణాలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పూర్తి చేసుకున్నారని, మహిళలు నెలకు సరాసరి 3 వేల రూపాయలు ఆదా చేస్తున్నారని, ప్రభుత్వం ఆర్టీసీ సంస్థకు 6700 కోట్ల రూపాయలు చెల్లించిందని అన్నారు.వి ద్యార్థులకు,యువకులకు, అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి చర్యలు చేపట్టామని, గత పాలకులు చేసిన అప్పులకు వడ్డీ భారం కూడా అధికంగా ఉందని అన్నారు.రైతులకు సన్న రకం ధాన్యంపై క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ ఇస్తున్నామని, రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు.రెసి డెన్షియల్ విద్యాసంస్థలలో కూడా సన్నబియ్యం పెడుతున్నామని అన్నారు.పాఠశాలలను మహిళా సంఘాల ద్వారా బాగు చేస్తున్నామని, పిల్లల ఏకరూప దుస్తులు మహిళా సంఘాల ద్వారా కుట్టించడం జరిగిందని అన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్, పెట్రోల్ బంక్ వంటి అనుకూలంగా ఉన్న ప్రతి రంగంలో మహిళలను ప్రోత్సహిస్తున్నామని అన్నారు.ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ 3వ డివిజన్ అభివృద్ధికి ప్రాధాన్యత కల్పిస్తూ మంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు.నగరంలో అన్ని సౌకర్యాలతో 3వ డివిజన్ ను ఆదర్శవంతంగా తయారు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు.ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ 3వ డివిజన్ లో సీసీ రోడ్డు , డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. నగరంలో రోడ్లు, ఫుట్ పాత్, పార్కు, డ్రైయిన్ వంటి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. విలీన గ్రామాల్లో అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు మంత్రి కొత్త రేషన్ కార్డుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు,ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు,పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్,మునిసిపల్ ఇఇ కృష్ణలాల్, నగరపాలక సంస్థ సహాయ కమీషనర్ అనిల్, ఏసీపీ వసుంధర,విద్యుత్ శాఖ డిఇ రామారావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ ఆదేశించారు.ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సురేంద్ర మోహన్,శనివారం హైదరాబాదు నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, యూరియా నిల్వలు,సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తలు,రేషన్ కార్డులు మంజూరు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలు, మున్నేరు వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ఏ ఒక్క ప్రాణహాని జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ఆపద మిత్ర వాలంటీర్లను అందుబాటులో ఉంచాలన్నారు. డిజాస్టర్ మేనేజ్మెంట్ ను పటిష్టంగా అమలు చేయాలనీ సూచించారు. రాష్ట్రంలో యూరియాకు సంబంధించి రెండు లక్షల టన్నుల దిగుమతి తగ్గిందని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తగినంత యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా అధికారులు యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. యూరియా నిల్వలు దారి మళ్లించి కొన్ని పరిశ్రమలు చట్ట వ్యతిరేకంగా వినియోగిస్తున్నాయని అన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ వరద విపత్తుల నిర్వహణ కోసం కలెక్టరేట్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ వద్ద 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని వరద ఉధృతి ప్రకారం ఏ ప్రాంతాలు ముంపుకు గురవుతాయో మ్యాపింగ్ చేశామని అన్నారు.ప్రస్తుతం ఖమ్మంలో మున్నేరు 7.5 అడుగులు మాత్రమే ఉందని పరిస్థితి కంట్రోల్లో ఉందని కలెక్టర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో కొంత మంది యువతను ఎంపిక చేసి ఆపద మిత్రులుగా విపత్తుల నిర్వహణపై శిక్షణ అందించామని, ప్రస్తుతం వారిని అలర్ట్ గా ఉంచామని కలెక్టర్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను వరదల నేపథ్యంలో సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ లో 8, 5 మున్సిపాలిటీలలో 13, మండల స్థాయిలో 54 రిలీఫ్ క్యాంపులు గుర్తించి అక్కడ అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు.చెరువు కట్టలు తెగితే అవసరమయ్యే ఇసుక బస్తాలను కూడా అందుబాటులో పెట్టుకున్నామని అన్నారు.వరదఉధృతంగా ఉన్న సమయంలో రాకపోకలు నిలిపి వేస్తున్నామని అన్నారు. ఖమ్మం నగరంలో 24 మంది సభ్యులతో ఎన్.డి. ఆర్.ఎఫ్ బృందాలు 4 బోట్లతో, 24 మంది సభ్యుల తో ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలు 2 బోట్లతో సిద్ధంగా ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.వరదల సమయం లో అవసరమయ్యే మైక్ సెట్, టార్చ్ లైట్, రోప్స్, సేఫ్టీ జాకెట్లు మండలాల వారీగా అందుబాటులో పెట్టామని అన్నారు.మహబూబాబాద్,వరంగల్ జిల్లాల వాతావరణ పరిస్థితులను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేస్తున్నామని,నూతనంగా 5 గేజ్ పాయింట్లను ఏర్పాటు చేసి 3 గంటలు ముందుగానే నీటి ప్రవాహ వివరాలను తెలుసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. వార్తల నేపథ్యంలో అధికారులంతా హెడ్ క్వార్టర్ లో ఉండాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు.ఎరువుల లభ్యత ప్రతిరోజు ట్రాక్ చేస్తున్నామని, ప్రస్తుతం 3 వేల మెట్రిక్ టన్నుల పైగా యూరియా అందుబాటులో ఉందని, మరో 2500 మెట్రిక్ టన్నుల యూరియా రెండు రోజులలో జిల్లాకు చేరుకుంటుందని, ఆగస్టు 3 వరకు అవసరాలకు యూరియా సరిపోతుందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు నెల అవసరాల కోసం ఖమ్మం జిల్లాకు అదనపు యూరియా అలాట్మెంట్ చేయాలని అన్నారు. ప్రతి సేల్ ఆన్ లైన్ ద్వారా జరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎరువులు డైవర్ట్ కాకుండా పక్కా నిఘా ఏర్పాటు చేశామని అన్నారు.ఖమ్మం జిల్లాలో ఇప్పటివరకు డెంగ్యూ 16, చికెన్ గున్యా 1,మలేరియా 2 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని ప్రైవేట్ ఆస్పత్రిలో నమోదు కేసులను కూడా ఫాలో అప్ చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని, కేసులో నమోదైన ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టామని అన్నారు.ఖమ్మం జిల్లాలో మంత్రివర్యులు రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించారని, మిగిలిన కార్డులను ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆగస్టు 10 లోపు మండలాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ జూమ్ మీటింగ్ లో ఖమ్మం నుండి మునిసిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సి.పి.ఓ.శ్రీనివాస్,డి.ఎం. సివిల్ సప్లైస్ శ్రీలత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జి.పుల్లయ్య, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా.కళావతి బాయి,ఎస్.ఈ.ఇరిగేషన్ ఎం.వెంకటేశ్వర్లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంచుకొండ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ట్రయల్ రన్ విజయవంతం

- దశాబ్దాల కల.. నిజమైన వేళ
- సంతోషం వ్యక్తం చేస్తున్న రఘు నాధపాలెం రైతులు





**రఘునాథపాలెం ప్రజా జ్యోతి :** మంచుకొండ గ్రామంలో చెరువుల న్నింటిని ఈనెల 24వ తేదీ న ట్రయల్ రన్ వేసి చెరువులు నీటితో ఎత్తిపోతల పథకం నీళ్లు విడుదల చేసినందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరావు ఆదేశాలు మేరకు, మార్కెట్ కమిటీ చైర్మన్ యంగర్ల హనుమంతరావు, మండల పార్టీ నాయకులతో కలిసి శనివారం ట్రయల్ రన్ విజయవంతం చేశారు , ఈ సందర్భంగా హనుమంతరావు మండల నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల ఎత్తిపోతల పథకం విజయవంతం కావడంతో పూలాభిషేకం, చేస్తున్నటువంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ సందర్భంగా రైతులు మండల నాయకులు మాట్లాడుతూ.తుమ్మల నాగేశ్వరావు సుభిక్షంగా అష్ట ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని 60 కోట్లతో ఎత్తిపోతల పథకం తో నీళ్లను దిగువ నుండి ఎగువకు ఎక్కించి భూమి లోతులో నుండి పైపులు వేసి చెరువులలో నీటిని పంపడం ద్వారా మండలంలోని 36 చెరువులు నీళ్లతో నిండి పచ్చని పైర్లతో ,పాడి పంటలతో రైతులు ఆనందంగా సంతోషంగా ఉండాలని ఎంత కష్టమైనా మన మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న తుమ్మల నాగేశ్వర రావు నాయకత్వానికి కృతజ్ఞతతో రైతులంతా చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పంపు హౌస్ కాడికి చేరి పంప్ హౌస్ లో పడుతున్న నీటికీ,పూలు పసుపు,కుంకుమ వేసి కొబ్బరికాయలు కొట్టడం జరిగింది. మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళుతున్న మంత్రి తుమ్మల... సంతోషం వ్యక్తం చేస్తున్న మండల నాయకులు రైతన్నలు.

# కార్గిల్ విజయ్ దివస్@త్రివేణి







**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక 1999 సంవత్సరం జూలై 26వ తేదీన భారత సైన్యం సాధించిన అద్భుత విజ యం.కార్గిల్ పర్వత ప్రాంతాల్లో పాకి స్తాన్ సైనికులు భారత సైన్యంపై జరిపిన దాడికి దీటైన జవాబు కార్గిల్ యుద్ధం ఈ యుద్ధంలో అమరులైన భారత జవాన్లను స్మరిస్తూ భారత దేశ విజయానికి అర్పించిన త్యాగాలకు నివాళులర్పిస్తూ ప్రతి సంవత్సరం మనం జూలై 26వ తేదీ ని కార్గిల్ విజయ్ దివసుగా జరుపుకుంటాం. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో కార్గిల్ విజయ్ దివాస్ ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాడిన దేశభక్తి గీతాలు, సైనికుల వేషధారణలో చేసిన నృత్యాలు అందరిని అలరించాయి.కార్యక్ర మంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి అమరుల త్యాగా లను స్మరిస్తూ విద్యార్థులు దేశభక్తి ఎదురైన పౌరులుగా ఎదగాలని ఆకాం క్షించారు.పాకిస్తాన్ లాంటి దాయాది దేశాలు కవింపు చర్య కారణంగా భారతదేశం యుద్ధం చేస్తుందే తప్ప భారత్ ఎవరిపైనా దాడికి పాల్పడదని శాంతియుతంగా భారతిని కవ్విస్తే భారీ మూ ల్యం తప్పదని మన సైన్యాలు రుజువు చేశాయని పాఠశాల ప్రిన్సిపల్ పి రాజేంద్రప్రసాద్ అన్నారు.ఈ యుద్ధాంతరం పాకిస్తాన్ ఏకాకి దేశంగా ప్రపం చం ముందు నిలబడిందని అంతేకాకుండా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పోషించే ఒక వికృత రాజ్యాంగ ప్రపంచానికి తేటతెల్లం అయింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో కృష్ణవేణి త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పాఠశాల సి ఆర్ ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న ముస్తఫా,ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొని భారత అమరవీరులకు నివాళులు అర్పించారు.

# తల్లాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శిగా దేవబత్తిని సీతారాములు ఎన్నిక



**తల్లాడ, జులై 26 (ప్రజా జ్యోతి న్యూస్) :**తల్లాడ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎండి బహదూర్, ప్రధాన కార్యదర్శిగా దేవబత్తిని సీతారాములు ఎన్నుకున్నారు. వీరితోపాటు గౌరవాధ్యక్షులుగా టీకే ప్రసన్నన్, కోశాధికారిగా గొడ్ల బాబురావు, ఉపాధ్యక్షులుగా ఇనపనూరి కుటుంబరావు, గొల్లమందల ప్రేమ్ కుమార్, సలహాదారులుగా నిర్మల రాజు,కాంపాటి రవి, ప్రచార కార్యదర్శిగా నారపోగు ప్రసాదు, సభ్యులుగా కొత్తపల్లి విజయ్, బోనాసి శ్రీనివాసరావులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ జర్నలిస్టుల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం జర్నలిస్టులకు ఇంది రమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు సకాలంలో అందించాలని కోరారు.తల్లాడ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని రాష్ట్ర నాయకులు రామ్ నారాయణ, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు ప్రత్యేకంగా అభినందించారు.

# తల్లాడలో మురికినీరును తొలగించిన పంచాయతీ అధికారులు




**తల్లాడ, జులై 26 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ రింగ్ రోడ్ పరిసర ప్రాంతాల్లో ఆగిన మురుగునీరును తొలగించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారి సహకారంతో తల్లాడ మేజర్ గ్రామపంచాయతీ అధికారులు శనివారం మురుగునీరును తొలగించారు. రింగ్ రోడ్డు మధ్య భాగంలో ప్రోక్లైన్ సహాయంతో రంధ్రం చేసి ఆగిన మురుగునీరును తొలగించేందుకు అధికారులు పనులను క్షుణ్ణంగా పరిశీలించి తొలగించారు. దీంతో ఎప్పటినుంచో అపరిస్కృతంగా ఉన్న సమస్యను మండల అధికారులు పరిష్కరించారు. ఆ రింగ్ రోడ్డు ప్రాంతంలో వర్షం వచ్చినప్పుడల్లా భారీగా రహదారిపై నీరు నిలిచి ప్రయాణికులను అనేక ఇబ్బందులకు గురి చేశాయి. ఆ నీటిని తొలగించడంతో అవస్థలు లేకుండా ప్రయాణికుల ఇబ్బందులు తొలగనున్నాయి తల్లాడ ఎంపీడీవో సురేష్‌బాబు, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ ఈవో కృష్ణారావు నేషనల్ హైవే అధికారులు ఏఈ కిరణ్, ఎండిఓ సురేష్ బాబు, పంచాయతీ సెక్రెటరీ కృష్ణారావు పాల్గొన్నారు.

# సొసైటీ ఎరువుల గోడౌన్లను తనిఖీ చేసిన మండల వ్యవసాయ అధికారి



**తిరుమలాయపాలెం, జూలై 26, ప్రజా జ్యోతి :**తిరుమలాయపాలెం మండల పరిధిలోని తిరుమలాయపాలెం, పిండిప్రోలు, జల్లేపల్లి సొసైటీ ఎరువుల సేల్ పాయింట్లను శనివారం నాడు మండల వ్యవసాయ అధికారి సీతారాం రెడ్డి తనిఖీ చేశారు. ఎరువుల అమ్మకాలను, నిలువలను, ధరలను సవివరంగా పరిశీలించారు. ఎరువు కట్టలు తీసుకుంటున్న విధానాన్ని రైతులనుఅడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన జల్లేపల్లి సొసైటీ ఎరువుల సేల్ పాయింట్ వద్ద రైతులతో మాట్లాడుతూ రసాయన ఎరువులు తగ్గించి సేంద్రీయ ఎరువులు వాడేటట్లుగా ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఆ క్రమంలోనే రసాయన ఎరువుల ఉత్పత్తులను, దిగుమతులను తగ్గించి సేంద్రి య ఎరువులు వాడే విధంగా ప్రభుత్వాలు రైతుల్ని సన్నద్ధం చేస్తాయని ఆయన రైతులకు సేంద్రీయ ఎరువుల యొక్క ఉపయోగాలను తెలియజేశారు. పొరుగు రాష్ట్రాలలో సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక పంట దిగుబడులను తీసుకువస్తున్నారని ఆవిధానాన్ని మన రాష్ట్రంలో కూడా అమలు పరిచేందుకు ప్రభు త్వాలు ప్రణాళికలు చేస్తున్నాయని ఆయనతెలిపారు. అధిక రసాయన ఎరువు ల వాడకం వలన వచ్చే పంటలను ఆహారంగా తీసుకోవటం వలన ప్రజలు అనేక దీర్ఘకాలిక, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారని, కాబట్టి ఆ విధా నానికి స్వస్తి పలికి రానున్న రోజుల్లో పూర్తిగా సేంద్రియ ఎరువులతో పండించి పంటలను. ఆహారంగా తీసుకున్నట్లయితే ప్రజల ఆరోగ్యం, జీవన విధానంలో సమూల మార్పులు వస్తాయని ఆయన తెలియజేశారు. ఎరువులు అవసరం ఉన్న ప్రతి రైతు ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్ కాపీలు సమర్పించి ఎరువులు తీసుకెళ్లాలని ఆయన రైతులకు సూచించారు.

# వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్ఓసిలను అందించిన తుమ్మల యుగంధర్



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక ఖమ్మం నియోజకవర్గం పలువురికి వైద్య ఖర్చులు నిమిత్తం మంత్రి తుమ్మల సిఫార్సు మేరకు వచ్చిన ఎల్ ఓసిలను అందించిన తుమ్మల యుగంధర్. ఖమ్మం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటూ సన్నిహితుల ద్వారా, స్వయాన తనే ఖమ్మం పట్టణం లోని, రఘునాథ పాలెం మండలంలోని పలు గ్రామాలలోని ప్రజల యొక్క సమస్యలు తెలుసు కొంటూ అండగా ఉంటున్న తుమ్మల యుగంధర్.పలువురు ఆరోగ్య సమస్యల గురించి చెప్పగా,వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు కి చెప్పి పలువురికి వైద్య ఖర్చులు నిమిత్తం, మంత్రి తుమ్మల సిఫార్సు మేరకు వచ్చి న ఎల్ ఓ సి లను అల్లిపురం, ఖమ్మం కి చెందిన గుండె పుష్పలత కి 1,70,000,బొక్కలగడ్డ కి చెందిన వేంపటి సాత్విక్ గణశ్యం కి 2,50,000 రఘునాథ పాలెం మండలం బూడిదంపాడు గ్రామం వాసి కొత్తపల్లి అనసూర్య కి 3,50,000/- బాధిత కుటుంబ సభ్యులకు తుమ్మల యుగంధర్ అందజేశారు.

# జవహర్ నగర్ లో పరిశీలించిన కమిషనర్, ఏఎంసి దోమా



**సత్తుపల్లి జూలై 26(ప్రజా జ్యోతి) :**ఇటీవల కురుస్తున్న వర్షాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని, ప్రజలకు తెలియజేయాలి అనే ఉద్దేశంతో మున్సి పల్ కమిషనర్ నరసింహ, మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్ బాబు శనివారం పట్టణం లోని జవహర్ నగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జవహర్ నగర్ లోని నీళ్లు నిలువ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కాలనీవాసులకు ఏమేమి కావాలి,అందరితో మాట్లాడుతూ కాలనీ మొత్తం కలియ తిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం పట్ల చాలా జాగ్ర త్తగా ఉండాలని, మురికి నీరు నిల్వ లేకుండా చూచుకోవాలని,వ్యక్తిగత పరిశు భ్రత పాటించాలని వారికి తెలియజేశారు. వారి వెంట దీపక్ కాలనీ వాసులు ఉన్నారు.

## కోటమైసమ్మ తల్లి జాతర దుకాణాల వేలం

- ఆలయ చైర్మన్ పరసపట్టాభిరామారావు





**కారేపల్లి,జులై 26, ప్రజా జ్యోతి :** దసరా పండుగ సందర్భంగా సింగరేణి మండల పరిధిలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న కోట మైసమ్మ తల్లి జాతరలో దుకాణాల ఏర్పాటుకు వేలం పాటను ఈనెల 28వ తేది సోమవారం నాడు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డాక్టర్ పర్సా పట్టాభిరామారావు, ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు శనివారం తెలిపారు.దేవదాయశాఖ కమీషనర్ ఉత్తర్వులు అనుసరించి జాతరలో కొబ్బరికాయలు, పూజసామాగ్రి అమ్మకొనే లైసెన్స్ హక్కు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.11 రోజుల పాటు కాలపరిమతి గాను వేలంలో పాల్గనువారు లక్ష రూ.ప్రధ మ ధరావతు సొమ్ము చెల్లించి పాటలో పాల్గనాలన్నారు. హెచ్చుపోటదారుల కు లైసెన్స్ హక్కులు కల్పించటం జరుగుతుందన్నారు.బహిరంగ వేలంను ఆలయ ప్రాంగణంలో 28వ తేది ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ ఉన్నతాధికారుల సమక్షంలో నిర్వహించబడని తెలిపారు .

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మార్వో ఏ. రమేష్



**కారేపల్లి, జూలై 26, ప్రజా జ్యోతి :** సింగరేణి మండల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మార్వో అనంతుల రమేష్ అన్నారు. శనివారం ఆయన విలేకరితో మాట్లాడుతూ గత నాలుగు రోజుల నుంచి మండలంలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండలంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల సంభవించే ప్రాంతాలకు వెళ్లవద్దని, వరద ప్రవాహ సమయంలో కాలువలు, వాగులు, చెరువులు వంటి జల వనరుల వద్దకి వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని ,. అలాగే రహదారులు, కల్వర్టులు పై నీరు ప్రవహిస్తున్న చోట్ల అధిక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరెంట్ పోల్స్, ట్రాన్స్ఫార్మర్లు, కరెంట్ మోటార్లు దగ్గరకు వెళ్లవద్దని అదే విధంగా చేపల వేటకు ఎవరు కూడా వాగులు ,చెరువుల వద్దకు వెళ్ల వద్దని పేర్కొన్నారు.

## జిల్లాలో రైతులందరికీ యూరియా సరఫరా చేస్తాం

- రైతులను రెచ్చగొడితే కేసులు నమోదు చేస్తాం
- గంగదేవిపాడు సొసైటీని తనిఖీ చేసిన సీపీ సునీల్ దత్



**తల్లాడ, జులై 26 ( ప్రజా జ్యోతి న్యూస్):** జిల్లాలో రైతులకు కావాల్సిన యూరియా ప్రభుత్వం దగ్గర సిద్ధంగా ఉందని, ప్రతి ఒక్క రైతుకు అందు తుందని, రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఖమ్మం జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సూచించారు. శనివారం తల్లాడ మండలం గంగదేవిపాడు సొసైటీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులు యూరియాను తీసుకెళ్లేందుకు సొసైటీకి వచ్చారు. తొలుత రికార్డులు పరిశీలించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.రైతులకు కావాల్సిన యూరియా ప్రభుత్వం దగ్గర అందుబాటులో ఉందని, దశలవారీగా రైతులకు అందించడం జరుగుతుందన్నారు.రైతులను రెచ్చగొట్టే విధంగా ఎవరైనా ఉసిగొలిపితే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి ఎండి తాజుద్దీన్ ను సిపి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలక్కుండా యూరియాను సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు పోలీస్ అధికారులు ఉన్నారు.

## నిర్ణీత గడువు నందు ఖమ్మంలోని అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- అండర్ గ్రౌండ్ డ్రయినేజీ నిర్మాణం పనులు సకాలంలో నాణ్యతతో చేయాలి
- సర్దార్ పటేల్ స్టేడియం లోని నూతన క్రీడా కోర్టులను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి
- ఖమ్మం నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక ఖమ్మం నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని,నగరాభివృద్ధికి ప్రణాళికాబద్ద చర్యల పై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్,ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి శనివారం నగరంలో పర్యటించి కొనసాగుతున్న పలు అభివృద్ధి నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఖానాపురంలోని నూతనంగా నిర్మిస్తున్న యు.పి.హెచ్.సి. భవన పనులు,బైపాస్ రోడ్, ఖానాపురం ప్రధాన రహదారి లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డైనేజి (యుజిడి) పనులు,సర్దార్ పటేల్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న అథ్లెటిక్ కోర్టు, ఇండోర్ స్టేడియం పనులు, ఇల్లందు క్రాస్ రోడ్ లో ఫుట్ పాత్ పనులను కలెక్టర్ పరిశీలించి, పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ,నగర ప్రజలే కాక,జిల్లా ప్రజలు ఆరోగ్యంగా,సంతోషంగా ఉండాలంటే పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు.మునిసిపల్ అధికారులు,సిబ్బంది ఇంకా శ్రద్ధ పెట్టి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఖమ్మం నగరం ఇతర నగరాలకు ఆదర్శంగా నిలిచేలాగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఖమ్మం నగరం అండర్ గ్రౌండ్ డైనేజీ క్రింద మురుగు నీటి కాల్వ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరుగుతున్నాయని అన్నారు.సర్దార్ పటెల్ స్టేడియంలో ఏర్పాటు చేస్తున్న క్రీడా వసతుల పనులను నాణ్యతతో ప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. స్టేడియాల ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం లభిస్తుందని అన్నారు.కలెక్టర్ వెంట జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ రంజిత్ కుమార్, మునిసిపల్ ఇఇ కృష్ణలాల్,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫోసిస్ సర్టిఫికేషన్స్ లో యస్.బీ. ఐ.టి కి జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానం



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** స్థానిక సాఫ్ట్ వేర్ దిగ్గజ సంస్థ ఇన్ఫోసిస్ కంపెనితో యస్బిఐటి కళాశాలకు ఉన్న అవగాహన ఒప్పందంలో భాగంగా యస్బిఐటి విద్యా ర్థులకు అందించిన స్ప్రింగ్ బోర్డ్ ఆన్ లైన్ ప్లాటుఫారం లో తమ కళాశాలలో నూత నంగా మొదటి సంవత్సరం అడ్మిషన్ పొందిన జంపాల సింధు అత్యధిక సర్టిఫికెట్స్ పొంది జాతీయ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్ విద్య మొదలు కాకమునుపే అడ్మిషన్ పొందిన నాటి నుంచే ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ ద్వారా కోడింగ్ క్లాస్ ల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగిందని తద్వారా ఈ కౌన్సిలింగ్ సమయంలో విద్యార్థులు కాలాన్ని వృథా చేయకుండా ప్రాథమిక నైపుణ్యాలను పెంపొందించాలనదే సద్వినియోగించుకోవాలని తమ ఉదేశ్యం అని తెలిపారు.ఇన్ఫోసిస్ సంస్థ తో గత సంవత్సరం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న నాటి నుండి స్ప్రింగ్ బోర్డ్ ద్వారా అనేక ఇంటర్న్షిప్ లు,హ్యాకాథన్ లు, సర్టిఫికేషన్స్ మరియు ఇండస్ట్రియల్ విజిట్స్ చేశామని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా జి.ధాత్రి తెలిపారు.తరగతి గదులలో నే కాకుండా ఇంటి వద్ద నుండి కూడా విద్యను అందించేందుకు అనేక రకాల ఆన్లైన్ ప్లాటుఫారం లను తెచ్చామని, ఐ. బీ. ఏం స్కిల్స్ బిల్డ్ కోడ్ తంత్ర, టాస్క్ మరియు ఐ.సీ .టీ. అకాడమీ వంటి జాతీయ స్థాయి సంస్థలతో ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. ఈ సంవత్సరం నుండి ప్రముఖ విప్రో కంపెనీచే గుర్తింపు పొందిన కళాశాలలో యస్బిఐటి ఉండటం గర్వ కారణమని , దీని లో భాగంగా కళాశాల సిబ్బందికి కంపెనీలో ట్రైనింగ్ ఇవ్వటం జరుగుతుంది తెలిపారు.ఇటువంటి కార్యక్రమాల ద్వారా తమ కళాశాల ఈ విద్యా సంవత్సరంలో 445 పై చిలుకు ప్లేస్మెంట్ అందు కోగలిగిందని హర్షం వ్యక్తం చేశారు.ఈ నెలలో జాతీయ స్థాయిలో అత్యధికంగా 148 సర్టిఫికేషన్స్ పూర్తి చేసి తమ విద్యార్థిని జంపాల సింధు రెండవ స్థానంలో నిలవడం కేవలం తమ కళాశాలకే కాకుండా, ఖమ్మం జిల్లా తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం అని కళాశాల ప్రిన్సిపాల్ డా| జి.రాజ్ కుమార్ తెలిపారు. కాలం అన్నింటికన్నా విలువైనదని కనుక ఉన్న సమయాన్ని సద్వినియోగ పరుచుకోవాలని తెలిపారు.ఈ సంధర్భంగా కళాశాలలో అడ్మిషన్ పొందిన జంపాల సింధు ను కళాశాల యాజమాన్యం సత్కరించి అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా ఎ.వి.వి. శివ ప్రసాద్, డా జె. రవీంద్రబాబు, వివిధ విభాగపు అధిపతులు డా సుప్రియా మీనన్, డా కె.స్ఫూర్తి,డా అమిత్ బిందాజ్ , డా చరణ్ సింగ్,డా పద్మావతి,టి.పి.ఒ.యన్.సవిత,కోఆర్డినేటర్ జి.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అధికారం శాశ్వతం కాదు అధికారులే శాశ్వతం

- ప్రభుత్వ అధికారులపై తప్పడు ఆరోపణలు తగవు
- సిపిఎం మండల కార్యదర్శి కిలారు సురేష్



**బోనకల్,జూలై 26, (ప్రజాజ్యోతి):** నిత్యం ప్రజల్లో మమేకమై,ప్రజల అవసరా లకు అనుగుణంగా పనిచేస్తూ, అన్ని వర్గాల వారిని సమన్వయ పరుస్తూ,వృత్తిపరంగా ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ,ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ ఎన్నో రకాల ఒత్తిడిలను భరిస్తూ అంకిత భావంతో వృత్తి బాధ్యతలు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు పట్ల ప్రతి ఒక్కరు వారి సేవలను గుర్తించి,వారిపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని సిపిఎం మండల శాఖ పేర్కొంది. శనివారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల కార్యదర్శి కిలారు సురేష్ మాట్లాడుతూ ఇటీవల కొంతమంది అధికార పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని,కొంతమంది ఉద్యోగులను బ్లాక్ మెయిల్ చే స్తూ, తాము చెప్పింది చేయాలని,ఒత్తిడి తెస్తూ,అహంకారంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని,వారి మాట వినని అధికారులను వేరే చోటకి బదిలీలు చేయించడం లాంటి చర్యలు చేపడుతున్నారని,అధికారం శాశ్వతం కాదని,అధికారులే శాశ్వతమని,ఇలాంటి చర్యలను సిపిఎం మండల పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు,ఇటీవల గోవిందాపురం(ఎల్ ),చొప్పకట్ల పాలెం గ్రామాల్లో జరుగుతున్న పరిణామాల దీనికి నిదర్శనం అని అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులను స్వేచ్ఛ పూరిత వాతావరణంలో పనిచేయటానికి అవకాశం కల్పించి,వారి చేత మరింత సమర్ధవంతంగా పని చేసేలా ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగుల ప్రోత్సహించాలని ఆయన అన్నారు.

# అభివృద్ధి పనుల్లో అధికారులు నిర్లక్ష్యం వీడాలి

- క్షేత్రస్థాయిలో ప్రజలకు అసౌకర్యం కలిగితే సహించేది లేదు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత రానీయవద్దని సూచన
- కరోనా సమయంలో రద్దయిన రైలు సర్వీసులను పునరుద్ధరించాలి
- దిశ సమావేశంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి
- పంచాయతీరాజ్,గ్రామ పంచాయతీ సెక్రటరీల పనితీరుపై తీవ్ర అసంతృప్తి
- హాజరైన ఎమ్మెల్యేలు సమావేశం దృష్టికి పలు సూచనలు








**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి :** అభివృద్ధి పనుల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని.. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించబోమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి హెచ్చరించారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి,సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ( దిశ) సమావేశానికి ఎంపీ రఘురాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై.. ఇల్లెందు, పినపాక,భద్రాచలం, వైరా, అశ్వారావుపేట ఎమ్మెల్యేలతో కలిసి జిల్లాస్థాయి ఉన్నతాధికాలతో చర్చించారు.నేషనల్ హెల్త్ మిషన్, మధ్యాహ్న భోజనం, సర్వశిక్షా అభియాన్, దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ జ్యోతి యోజన, ప్రధాన మంత్రి గ్రామ్ సడక్ యోజన, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తదితర పథకాల పురోగతి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ శాఖ టెండర్ల నిర్వహణలో విఫలమవుతుందని ఫలితంగా పలు అభివృద్ధి పనులు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పనితీరు మార్చుకోవాలని,త్వరలోనే రీటెండర్లు నిర్వహించి పూర్తిచేయాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామాల్లో ఇసుక కొరత రానీయొద్దని.. అందుకు కావాల్సిన ఏర్పాట్లు చూడాలని కలెక్టర్ కు సూచించారు. పంచాయతీ కార్యదర్శులపై తీవ్రస్థాయిలో ఫిర్యాదులు అందుతున్నాయని స్వయంగా తన దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని తీరు మారకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి తీసుకెళ్లాలని సూచించారు. కరోనా సమయంలో ఆపివేసిన పలు రైలు సర్వీస్ లను పునరుద్ధరించాలని రైల్వే అధికారులను కోరారు. వర్షాకాలం కావడంతో పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ,వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్,పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.. వివిధ శాఖల పనితీరులో లోపాలను వెల్లడించగా ఎంపీ స్పందిస్తూ త్వరలోనే అందరూ సరిదిద్దుకోవాలని, ఇకపై లోపాలు కనిపించొద్దని సూచించారు.క్రీడా సామగ్రి అందజేత, వివిధ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు.. క్రీడా సామగ్రిని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అందజేశారు.బ్యాటరీ సైకిళ్లను కూడా పంపిణీ చేశారు.ఆయా కార్యక్రమాల్లో వివిధ శాఖల జిల్లా అధికారులు,పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై ఆగ్రహం
- జడ్పీ సీఈవో దీక్ష రైనా





**పాలేరు ఆర్సీ జులై 26 ప్రజా జ్యోతి :** వర్షాలు విపరీతంగా కురుస్తున్న నేపథ్యంలో సంక్రమించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జడ్పీ సీఈవో దీక్షా రైనా అన్నారు. కూసుమంచి మండలంలోని పాలేరు, నాయకన్ గూడెం, జీళ్లచెరువు, మల్లేపల్లి గ్రామాల్లో ఆమె పర్యటించి ఆరోగ్య కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధులు ప్రజలకి ప్రబలకుండా గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నిత్యం గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటుగా దోమల నివారణకు తీమోపాస్ ను పిచికారీ చేయాలని సూచించారు. డ్రై డే కార్యక్రమాలు నిర్వహించడంతో పాటుగా దోమల బారిన పడకుండా దోమల తెరలు వాడేలా ప్రజలకి అవగాహన కల్పించాలని కోరారు. అదే విధంగా ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేస్తూ విధిగా పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. పాలేరు బస్టాండ్ ను సందర్శించి ఆవరణలో ఉన్న రోడ్ సమస్య గురుంచి ఖమ్మం బస్ డిపో మేనేజర్ తో చరవాణిలో మాట్లాడారు. నాయకన్ గూడెం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు విష జ్వరాలు వ్యాపించకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

### పాఠశాలకు తాళం వేయడంపై ఆగ్రహం

ఈ నెల 23 న నాయకన్ గూడెం ప్రాథమిక పాఠశాలకి మధ్యాహ్న సమయానికే తాళం వేసి ఇంటి బాట పట్టిన విషయం పై సీఈఓ దీక్షా రైనా వివరాలు ఆరా తీశారు. పాఠశాలను సందర్శించి, పలు రికార్డులను పరిశీలించారు. ఎలాంటి సమాచారం లేకుండా విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ లీవు పేరుతో విధులకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుల వివరాలు, సంబంధిత పత్రాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నాయకన్ గూడెం నుండి జీళ్ళచెరువు, కూసుమంచి నుండి మల్లేపల్లి వరకు వనమహోత్సవంలో మొక్కలు నాటబోయే పని ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ ఎంపీడీఓ రామచందర్ రావు, ఎంఈఓ రాయల వీరస్వామి, ఏపీఓ అప్పారావు, కార్యదర్శులు రాజేష్, ఉపేందర్, హరీష్, రవి శంకర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అధిక వర్షాల సమయంలో ప్రత్తి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- మండల వ్యవసాయ శాఖ అధికారి రామడుగు వాణి

**పాలేరు ఆర్సీ జూలై 26 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలోని అగ్రహారం గ్రామంలో ప్రతి పంటను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూగత వారం రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రత్తి పంటకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో అధిక వర్షాలకు వల్ల ప్రత్తి పంటను కాపాడుటకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతుల్లో ముఖ్యంగా నీటిని సాధ్యమైనంత త్వరగా తీసివేయాలనీ ,వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించడానికి అంతర కృషి చేయాలనీ సూచించారు. దీని ద్వారా భూమిలో తేమ తగ్గి మొక్కలు సాధారణ స్థాయికి చేరుకుంటాయి. ప్రత్తి విత్తుకొని 30–40రోజులు దశలో ఉన్న పంటకు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కకు 5 – 7 సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలి. అధిక వర్షాలకు అక్కడక్కడ వేరు కుళ్ళు తెగులును గమనించడం జరిగిందని దీని నివారణకు వెంటనే కాపర్ ఆక్సి క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ 1 గ్రా. లీటర్ నీటి కలిపి మొక్క మొదళ్ళ లో తడపాలనీ సూచించారు. మరికొన్ని చోట్ల అధిక వర్షాలకు లేత పసుపు రంగుకు మారిన మొక్కలను గమనించడం జరిగిందని, దీని నివారణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసినట్లయితే మొక్కలు సాధారణ స్థితికి వస్తాయి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గట్టుసింగారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి వంశీకృష్ణ రైతులు పాల్గొన్నారు.



## కోతి దాడి నుంచి తప్పించుకునే క్రమంలో బాలుడికి గాయాలు

**బోనకల్,జూలై 26,(ప్రజాజ్యోతి) :** బోనకల్ మండ ల కేంద్రానికి చెందిన అంతోటి ఆర్యన్ ప్రజ్వన్(13) ఇంటి పై వెళ్ళగా అప్పటికే అక్కడ ఉన్న కోతి ఒక్క సారిగా దాడి చేయడానికి ప్రయత్నం చేయగా, దాని నుండి తప్పించుకునే క్రమంలో కాలు జారీ కిందపడి గాయాల పాలయ్యాడు, వెంటనే కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి సమాచారం అందించారు, స్పం దించిన 108 సిబ్బంది కోట భాను సహాన్ తడికమల్ల శ్రీనివాసరావు ప్రధమ చికిత్స అందించి ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



## 31న జరిగే ధర్నాను జయప్రదం చేయండి

- టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు




**తల్లాడ, జులై 26 (ప్రజా జ్యోతి న్యూస్):** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలో కార్మిక వర్గానికి కనీస వేతనం 26,000 ఇవ్వాలని కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులర్ చేయాలని పెన్షన్ 9000 రూపాయలు ఇవ్వాలని 12 గంటలుపని వ్యతిరేకించాలని అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనిడిమాండ్ చేస్తూ టియుసి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా, జూన్ 31న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని టి యు సి ఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం తల్లాడ మండల కేంద్రంలో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు ప్రచారం నిర్వహిస్తూ మాట్లాడుతూ దశాబ్దాలుగా కనీస వేతనాలు లేకుండా అత్యధిక పని గంటలకు కార్మికులుశ్రమదోపిడికి గురవుతున్నారన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ లాల్మియా సిహెచ్ రామకృష్ణసిహెచ్ రాఘవ జి శ్రీను సిహెచ్ సైదులు నాగేశ్వరరావున పాల్గొన్నారు.

## పారిశుధ్య పనులను పరిశీలించిన ఎంపీడీఓ రామచంద్రయ్య



**పాలేరు ఆర్సీ జూలై 26 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. దీంతో పారిశుధ్య సమస్య, దోమలు పెరిగి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. అందులో భాగంగానే మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభించాలని కార్యదర్శులకు ఎంపీడీఓ రామచంద్రయ్య ఆదేశించారు. ఈ మేరకు శనివారం చేగొమ్మ గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఎంపీడీవో రామచంద్రయ్య పరిశీలించారు. పనులను పర్యవేక్షణ చేశారు. ఏపీవో అప్పారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## సొసైటీలను తనిఖీ చేసిన ఏవో వాణి,ఎస్.ఐ.నాగరాజు

**పాలేరు ఆర్సీ జూలై 26 ప్రజా జ్యోతి :** కూసుమంచి మండలంలోని జక్కేపల్లి, పెరిక సింగారం (కల్లూరు గూడెం) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి, కూసుమంచి మండలం కూసుమంచి ఎస్ఐ. నాగరాజు కలిసి సంయుక్తంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు అందుబాటులో యూరియా నిల్వలను ఉంచాలని, రైతుల అవసరాలకు అనుగుణంగా ఉదయం 8 గంటల నుండి ఎరువులను పంపిణీ చేయాలని సూచించారు . ఎరువుల విక్రయాన్ని పిఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే జరపాలని, రైతు వారీగా యూరియా విక్రయాలను నమోదు చేయాలని , రైతులకు కనపడే విధంగా ఎరువుల నిల్వల వివరాలను తెలుపుతూ స్టాక్ బోర్డును ప్రతిరోజూ ప్రదర్శించాలని తెలియజేశారు.ఎరువుల పంపిణీ విషయంలో రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వంశీకృష్ణ, నవీన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## పార్టీతో సంబంధం లేదు.. అర్హులకే సంక్షేమ పథకాలు... ఎమ్మెల్యే రాగమయి

**సత్తుపల్లి జూలై26(ప్రజా జ్యోతి):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇటీవల ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన రేషన్ కార్డులను,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ శనివారం లాంఛనంగా పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని మండల పరిధిలోని కొత్తూరు గ్రామం రైతువేదికలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుపేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం శాసన సభ్యురాలు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలులో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, మాయ మాటలు చెబుతూ పబ్బం గడుపుకుంటూ, కాలం గడిపినారని అన్నారు. ప్రతిదానికి రేషన్ కార్డు ఎంత అవసరం ఉంటుంది కానీ 10 సంవత్సరాల్లో పేద ప్రజల గురించి ఆలోచించకుండా మాయమాటలతో ఉన్నారని అన్నారు. పెళ్లయి,పిల్లల పుట్టినగాని,రేషన్ కార్డు లేని పరిస్థితి కుటుంబంగా గుర్తింపు లేని పరిస్థితి, ఎన్నో సంవత్సరాలు వారి ఆశ నేడు ఇందిరమ్మ ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి బట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సివిల్ సప్లై మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి నాయకత్వంలో ఈరోజు ప్రజలందరికీ రేషన్ కార్డులు అందించడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. ఆరోగ్యశ్రీ కావాలన్నా రేషన్ కార్డు ఉండాలి,సన్న బియ్యం తీసుకోవాలన్న రేషన్ కార్డు కావాలి,విద్యార్థులకు స్కాలర్షిప్ రావాలన్న, ఇన్కమ్ సర్టిఫికెట్ కావాలన్నా,రేషన్ కార్డు కావాలని,ఏ గవర్నమెంట్ దానికైనా అప్లికేషన్ పెట్టుకోవాలంటే రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి కానీ గత ప్రభుత్వం రేషన్ కార్డు మంజూరు చేస్తే ఎక్కడ బాగుపడతారు అనే దురుద్దేశంతో ఒక్కటంటే, ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు. ప్రజలందరూ ఏకతాటిపై ఉండి మమ్మల్ని గెలిపించినందుకు,మాట ఇచ్చిన ప్రకారం ప్రతి కుటుంబానికి గుర్తింపు కార్డు ఉండాలనే ఉద్దేశం తోటి, రేషన్ కార్డులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజే శారు. ఇంకా ఎవరికైనా రేషన్ కార్డులు అందకపోతే అధికారులు వాటిని వెంటనే పరీక్షించి, లబ్ధిదారులకు చేకూరేలా ప్రయత్నం చేయాలని ప్రతి పేద ప్రజలు అభివృద్ధి పొందేది కాంగ్రెస్ పార్టీతోనే ఉండాలని తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో అర్హత కలిగిన ఏ ఒక్కరి కూడా రేషన్ కార్డు నాకు రాలేదు అని తెలిస్తే, ఆ అధికారిపై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడి 18 నెలలు అయినా మీకోసం ఇచ్చిన హామీ మాట ప్రకారం అన్ని కోరికలు నెరవేర్చామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి చేసిన విధంగానే మళ్లీ మీ ఆశీస్సులతో అత్యధిక స్థానాలు గెలిచే విధంగా సహకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజేందర్ గౌడ్, తాసిల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, ఆర్ ఐ జానీ మియా, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు, చల్లగుండ్ల నరసింహారావు, కమల్ పాషా,మట్టా చెన్నారావు, మానుకోట ప్రసాద్,గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి,కొప్పుల నరేందర్ రెడ్డి, గోళ్ళముడి మధు, యూనిస్, గఫర్, ఆంగోతు రామారావు కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బోనకల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్






**బోనకల్,జూలై 26, (ప్రజాజ్యోతి):** బోనకల్ పోలీస్ స్టేషన్ ను ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ శుక్ర వారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఆయనకు ఎస్సై వెంకన్న స్వాగతం పలికా రు, ఈ సంధర్భంగా పోలీస్ కమి షనర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ, పోలీ సుల పనితీరు, సెక్టార్ అధికారుల విచా రణ నివేదికలు,విచారణలో వున్న కేసు లు,చార్జిషీట్,ఫంక్షనల్ వర్టిక ల్స్,5 ఎస్ అమలు, హెచ్ఆర్ఎం ఎస్,జనరల్ డైరీ రికార్డులు,కేసుల్లో వున్న వాహ నాలను పరిశీలించారు. రిసెప్షన్,పిటిషన్ విచారణలకు సంబంధించి సిబ్బందితో మా ట్లాడారు. స్టేషన్ హౌస్ మేనేజ్ మెంట్, పోలీస్ స్టేషన్ సెక్టార్ ఆఫీసర్ల భాధ్యత లు తదితర అంశాలను పరిశీలించా రు.పెట్రోకార్,బీట్ డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు? పాత నేరస్థుల నివాసాలను కదలికల ను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా సరిహ ద్దుల నుండి అక్రమ రవాణాను నియంత్రించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాల తనిఖీలు ముమ్మరం చేయా లని ఆదేశించారు. ఎస్సై పొదిలి వెంక న్న,స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

## అకాల వర్షాలపై అప్రమత్తంగా ఉండండి

- అవసరమైతే తప్ప ఎవరు కూడా బయటకు రావద్దు
- మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్



**తిరుమలాయపాలెం, జూలై 26, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండల ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ విజ్ఞప్తి రాష్ట్రంలో ఏర్పడిన వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ప్రజలు అవసరమైతే తప్ప ఇండ్ల నుండి బయటకు రావద్దని కోరినారు. వర్షాభావం ప్రభావంతో రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలకు జోరుగా వ్యవసాయ పనులు నడుస్తున్నందున వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటర్ల కు కరెంటు వచ్చే అవకాశాలు ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు వహించాలని. గ్రామాలలోని కరెంటు స్తంభాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని, తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని, వర్షపు నీరు ప్రవహిస్తున్న కాలువలపై మోరీల పై నుండి దాటరాదని, పాడుబడిన పాత భవనాలు, ఇండ్ల పక్కన నిలబడరాదని తెలిపినారు, గత వారం రోజుల నుండి కురుస్తున్న వర్షాలు మరో వారం రోజులు కురిసే అవకాశం ఉన్నందున మండలంలోని ప్రజలు గత సంవత్సరం ఆకేరు వరద ఉధృతిని దృష్టిలో పెట్టుకొని ఆకేరు సరిహద్దు గ్రామాలు రావి చెట్టు తండా, హైదర్ సాయిపేట, రాకాసి తండా సంబంధించిన ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని, గత వారం రోజుల నుండి కురుస్తున్న అకాల వర్షాలకు గ్రామాలలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ఆరోగ్య రీత్యా కూడా ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

## పత్తి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు స్వర్ణ విజయ్ చంద్ర



**బోనకల్, జులై 26, (ప్రజా జ్యోతి):** మండల పరిధిలో ముష్టికుంట్ల గ్రామంలో పత్తి పంటను సహాయ వ్యవసాయ సంచాలకులు (మధిర) స్వర్ణ విజయ్ చంద్ర మండల వ్యవసాయ అధికారి పసునూరి వినయ్ కుమార్ సందర్శించారు,ఈ క్షేత్ర పరిశీలనలో భాగంగా రైతులకు పలు సూచనలుసలహాలు తెలియజేశారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా పత్తి పంటలో వడలు తెగులు అనేది సాధారణంగా అక్కడక్కడ కనిపిస్తుందని వడలు తెగులు నివారణకు కొన్ని యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా దీనిని సమర్థవంతంగా అరికట్ట వచ్చునని తెలిపారు.ముందుగా తెగులు సోకిన పత్తి మొక్కలను పీకి పత్తి పంటకు దూరంగా వేయాలని అదేవిధంగా కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, లీటర్ నీటికి కలిపి ఆ మిశ్రమాన్ని మొక్క మొదలు భాగం తడిచే విధంగా వేసుకోవాలని అన్నారు,గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పత్తి పంట దెబ్బతినే అవకాశం ఉంది. కావున రైతులందరూ తమ పొలంలోని నీరు బయటకు వెళ్ళిపోయేలా చిన్న చిన్న కాలువలు చేసుకోవాలన్నారు,వర్షపు నీరు నిలబడిన చోట సూక్ష్మధాతు లోపం వచ్చే అవకాశం ఉంది కాబట్టి 10 గ్రాములు యూరియా లేదా 19:19:19 లేదా 13:0:45 లీటర్ నీటిలో కలుపుకొని వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.అదేవిధంగా రైతులందరూ నానో(ద్రవ) యూరియా వాడటం ద్వారా పంట ఉత్పత్తి మరియు ఉత్పాదకత పెరుగుతుంది అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మరీదు త్రివేణి,గ్రామ రైతులు పాల్గొన్నారు.